ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 67 పేజీలు - 04 వెల - 04/- సోమవారం 16 డిసెంబర్ 2024

# వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లులపై సందిగ్ధత...

**సోమవారం లోక్‌సభ బిజినెస్ అజెండాలో కనిపించని బిల్లులు**

**మోదీ సర్కారు ఊహించని నిర్ణయం**

**ప్రస్తుత సమావేశాలకు మరో నాలుగు రోజులే సమయం**





ఆంధ్ర ప్రగతి , డిసెంబరు 15 :
ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' బిల్లుల విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. లోక్‌సభలో సోమవారం (డిసెంబర్ 16) ఈ బిల్లులను ప్రవేశపెట్టబోతున్నట్టు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం అనూహ్యంగా వెనక్కి తగ్గింది. లోక్‌సభ సోమవారం బిజినెస్ అజెండా నుంచి వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లులను తొలగించింది. ఈ మేరకు అప్‌డేట్ చేసిన లిస్టులో ఈ బిల్లులు కనిపించడం లేదు. దీంతో ఈ బిల్లులు చట్టసభల ముందుకు రావడంపై సందిగ్ధత నెలకొంది. కాగా, ఈ బిల్లులను కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ సోమవారం సభలో ప్రవేశపెడతారని ప్రభుత్వం ఇటీవలే ప్రకటించింది. ఆ మేరకు లిస్టులో కూడా చేర్చింది. అవగాహన కోసం ఎంపీలకు బిల్లుల కాపీలను సైతం పంపిణీ చేసింది. అంతలోనే ఈ పరిణామం చేసుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ బిల్లులను తిరిగి ఎప్పుడు సభలో ప్రవేశపెడతారనే విషయంపై కూడా ఎలాంటి సమాచారం లేదు. డిసెంబర్ 20తో ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగియనున్నాయి. సోమవారాన్ని మినహాయిస్తే మరో నాలుగు రోజులే మిగిలి ఉంటాయి. మరి ఈ సెషన్‌లోనే సభ ముందుకు బిల్లులను తీసుకొస్తారా... లేదా? అనేది తెలియాల్సి ఉంది.

# అమరజీవి త్యాగం మరువలేనిది



**అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతి భవనం**

- రాష్ట్రంలో త్వరలో ఆయన పేరిట తెలుగు విశ్వవిద్యాలయం
- రాష్ట్రాభివృద్ధికి కృషి చేసిన మహానుభావులను గుర్తుంచుకోవాలి
- సీఎం చంద్రబాబు పిలుపు
- దేశం మొత్తం గర్వించే వ్యక్తి పొట్టి శ్రీరాములు: పవన్ కల్యాణ్
- అమరజీవికి ఘన నివాళి



విజయవాడ:ఆంధ్ర ప్రగతి డిసెంబరు 15 :
ఆంధ్రప్రదేశ్‌లో త్వరలోనే శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీని నెలకొల్పుతామని సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఉమ్మడి మద్రాసు నుంచి తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోసం.. పొట్టి శ్రీరాములు సాగించిన మహత్తర పోరాటం మరువలేనిదన్నారు

మిగతా 2లో

# చంద్రబాబుకు సంపద సృష్టించే శక్తి లేదు: జగన్

**సీఎం చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ విమర్శలు**

**చంద్రబాబు పాలించిన ప్రతి సంవత్సరం కూడా రెవెన్యూ లోటేనని వెల్లడి**

**ఇప్పుడు విజన్-2047 పేరుతో మరో కట్టుకథ చెబుతున్నారంటూ ట్వీట్**

ఆంధ్ర ప్రగతి అమరావతి, డిసెంబరు 15 :
చంద్రబాబు ముఖ్యమంత్రిగా పరిపాలించిన ప్రతి సంవత్సరం కూడా రాష్ట్రంలో రెవెన్యూ లోటు కనిపించిందని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ఆయన 14 ఏళ్ల పాలనా కాలంలో ఒక్క ఏడాదైనా మిగులు ఆదాయం కనిపించిందా? మరి ఇంకెక్కడ సంపద సృష్టి? అంటూ ధ్వజమెత్తారు. చంద్రబాబుకు సంపద సృష్టించే శక్తి లేదని, సమగ్రమైన ఆర్థిక నియంత్రణ కూడా లేదని తెలిపారు. ఇప్పుడు విజన్-2047 డాక్యుమెంట్ ద్వారా ఏపీ ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లు చేస్తానంటూ చంద్రబాబు కట్టుకథ చెబుతున్నాడని మండిపడ్డారు. మామూలుగానే ఏ రాష్ట్రంలో అయినా కాలం గడిచే కొద్దీ ఆర్థిక వ్యవస్థ కొంచెం పెరుగుతుందని... కానీ సంపద సృష్టి ఎప్పుడూ చేయని బాబు గారు మాత్రం, ఆ పెరుగుదల తన వల్లేనని చెప్పుకుంటుంటారని విమర్శించారు. సంపద సృష్టి అటుంచి ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి సంపదను ఆవిరి చేస్తుంటాడని వివరించారు. ప్రభుత్వంలో సృష్టించిన ఆస్తులను చంద్రబాబు తన వారికి



అమ్మేసేందుకు ప్రయత్నిస్తున్నారని జగన్ ఆరోపించారు. పేదరిక నిర్మూలన అమలు కార్యక్రమాలన్నింటినీ తీసివేసి... పేదలను మరింత పేదలుగా తయారుచేస్తున్నాడని... మరి చంద్రబాబుకు విజన్ ఉందని ఎలా అనుకుంటారు? అంటూ జగన్ ధ్వజమెత్తారు. "విజన్-2047 పేరిట చంద్రబాబు మరోసారి పబ్లిసిటీ స్టంట్ కు దిగారు.

మిగతాది 2లో...

# ప్రముఖ తబలా వాద్యకారుడు జాకీర్ హుస్సేన్ ఇక లేరు

ముంబయి ఆంధ్ర ప్రగతి డిసెంబరు 15 :
ప్రముఖ తబలా వాద్యకారుడు ఉస్తాక్ జాకీర్ హుస్సేన్ ఇకలేరు. అనారోగ్యంతో అమెరికా శాన్ ఫ్రాన్సిస్కోలోని ఓ ఆసుపత్రిలో చేరిన ఆయన తాజాగా మరణించారు. గత వారం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆయన నేటి రాత్రి కన్నుమూసారు ఆయన వయస్సు 73 సంవత్సరాలు. జాకీర్ హుస్సేన్ ప్రసిద్ధ తబలా వాద్యకారుడు, ఆయన మార్చి 9, 1951న బొంబాయిలో (ప్రస్తుతం ముంబై) జన్మించారు. ఆయన తండ్రి ఉస్తాద్ అల్లా రఖా ఖాన్. ఆయన ప్రసిద్ధ తబలా వాద్యకారుడు. తండ్రి దగ్గర తబలా వాయించే కళ నేర్చుకున్నాడు. మిగతాది 2లో...



# కడప గడపకు పసుపు పూత...

## వైసీపీకి డేంజర్ బెల్స్ ?




2లో

# రాష్ట్రంలో సాహితీ పర్యాటకం..!

**- తెలుగు భాష అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు - ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి**

ఆంధ్ర ప్రగతి అమరావతి, డిసెంబరు 15 :
రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకం, చారిత్రక స్థలాల పర్యాటకం ఉన్న మాదిరిగానే సాహితీ పర్యాటకం కూడా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఆదివారమిక్కడ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ కమిటీ ప్రతినిధులు ఆయన్ను కలిశారు. 35 ఏళ్ల నుంచి విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెబుతూ అందుకు సంబంధించిన వివరాలను వారు తెలియజేశారు. కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవం నిర్వహణకు అవసరమైన స్థలం లేక ఇబ్బందులుపడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శ్రీశ్రీ, గురజాడ, చలం, గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, తిలక్, దేవులపల్లి కృష్ణశాస్త్రి లాంటి గొప్ప కవులు, రచయితల స్వస్థలాలు, అక్కడ వారి జ్ఞాపకాలను కాపాడడం.. మిగతాది 2లో...



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


# చంద్రబాబుకు సంపద సృష్టించే శక్తి లేదు: జగన్

(మొదటి పేజీ తరువాయి)
ప్రజలను మాయచేయడానికి ఇదొక ఎత్తుగడ. 1998లో కూడా చంద్రబాబు ఇలాగే విజన్-2020 పేరిట డాక్యుమెంట్ తెచ్చారు. రాష్ట్ర చరిత్రలో అదొక చీకటి అధ్యాయం. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు, పనుల కోసం వలసలు వెళ్లారు, ఉపాధి లేక, ఉద్యోగాల్లేక ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. వీటన్నింటినీ దాచిపెట్టి చంద్రబాబు తన విజన్ కోసం నడిపించిన ప్రచారం అంతా ఇంతా కాదు. అప్పటి స్విట్జర్లాండ్ ఆర్థికమంత్రి పాస్కల్ హైదరాబాద్ వచ్చిన సమయంలో... ఇలా విజన్ డాక్యుమెంట్ల పేరిట అబద్ధాలు చెబితే మా దేశంలో అయితే జైలుకు గానీ, ఆసుపత్రికి గానీ పంపిస్తామని అన్నారు. చివరికి ప్రజలు కూడా ఆ డాక్యుమెంట్ ను వ్యతిరేకించారు. 2014లోనూ చంద్రబాబు విజన్-2029 అన్నారు... అది కూడా ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయింది" అని జగన్ విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ మేరకు భారీ ట్వీట్ చేశారు.

## రాష్ట్రంలో సాహితీ పర్యాటకం..!

(మొదటి పేజీ తరువాయి)
వారి సాహిత్య సేవలు తెలిపే స్మారక కేంద్రాల నిర్మాణం వంటి వాటి ద్వారా ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయవచ్చన్నారు.మాతృ భాషపై నవతరంలోనూ, చిన్నారుల్లోనూ ప్రేమాభిమానాలు పెంచడంతో పాటు మన కవులు, రచయితల గొప్పదనాన్ని తెలియజేసేలా తెలుగు సాహితీ యాత్రలు నిర్వహించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. 'వేటపాలెం గ్రంథాలయం, రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయం, కడప సి.పి.బ్రౌన్ గ్రంథాలయం లాంటి ప్రముఖ గ్రంథాలయాలు ఏపీలో ఉన్నాయి. వీటిని, కవులు, రచయితల నివాసాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్స్ ఏర్పాటు చేయవచ్చు. ఈ అంశంపై భాషా, సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించాలి' అని చెప్పారు. ఆయన్ను కలిసినవారిలో బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు టి.మనోహర్ నాయుడు, కె.లక్ష్మయ్య, గొల్లనారాయణరావు, సాందీపని ఉన్నారు

## ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

### కుల గణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలి

### మాలల సింహగర్జనలో నేతల డిమాండ్



గుంటూరు, ఆంధ్ర ప్రగతి డిసెంబరు 15 :
దేశవ్యాప్తంగా కుల జనగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌ను పెంచాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ జాతీయ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు శివారులో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు పలువురు హాజరయ్యారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మునిమనవడు యశ్వంత్ అంబేడ్కర్ మాట్లాడుతూ వర్గీకరణతో ఎస్సీల్లోని ఉపకులాలను విచ్ఛిన్నానికి ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయన్నారు. జైభీమ్‌రావు భారత్ పార్టీ అధినేత జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వేసిన రాజీవ్‌మిశ్రా కమిషన్ రాజ్యాంగ విరుద్ధమైనదన్నారు.
మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్ల ఏర్పాటు పేరుతో ఎస్సీల విచ్ఛిన్నానికి కుట్ర చేశారని మండిపడ్డారు. వర్గీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్త కుల జనగణన చేపట్టి రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, తెలంగాణ ఎమ్మెల్యేలు జి.వివేక్, నాగరాజు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, గుంటూరు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన హాజరై సంఘీభావం తెలిపారు.

## ప్రముఖ తబలా వాద్యకారుడు జాకీర్ హుస్సేన్ ఇక లేరు

(మొదటి పేజీ తరువాయి)
ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ఏడేళ్ల వయసులో కచేరీలలో తబలా వాయించడం ప్రారంభించాడు. ముంబైలోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. జకీర్ యూనివర్శిటీ ఆఫ్ వాషింగ్టన్ నుంచి సంగీతంలో డాక్టరల్ డిగ్రీని పూర్తి చేశారు.
ఆ తర్వాత జాకీర్ 1991లో ప్లానెట్ డ్రమ్ కోసం డ్రమ్మర్ మిక్కీ హార్ట్‌తో కలిసి పనిచేశాడు. ఇది గ్రామీ అవార్డును గెలుచుకుంది. తరువాత సంవత్సరాల్లో హుస్సేన్ అనేక చిత్రాల సౌండ్‌ట్రాక్‌లకు సహకరించారు. జాకీర్ హుస్సేన్‌కు 1991లో సంగీత నాటక అకాడమీ అవార్డు లభించింది. అట్లాంటాలో జరిగిన సమ్మర్ ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలకు సంగీతం అందించిన బృందంలో ఆయన కూడా సభ్యుడు.ఆల్-స్టార్ గ్లోబల్ కాన్సర్ట్‌లో పాల్గొనేందుకు 2016లో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా వైట్‌హౌస్‌కి ఆహ్వానించిన తొలి భారతీయ సంగీతకారుడు కూడా. జాకీర్ హుస్సేన్‌కు 1988లో పద్మశ్రీ, 2002లో పద్మభూషణ్, 2023లో పద్మవిభూషణ్‌ను కూడా భారత ప్రభుత్వం ప్రదానం చేసింది. సంగీత ప్రపంచంలో యాక్టివ్‌గా ఉన్న జాకీర్ హుస్సేన్‌కు కోట్లాది మంది అభిమానులు ఉన్నారు.ఆయన మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ తో సహా పలువురు రాజకీయ, క్రీడా, సినీ, సంగీత కళాకారులు సంతాపం ప్రకటించారు

## ఆధార్ ఉచిత అప్ డేట్ గడువు మరోసారి పొడిగింపు

### పౌరుల గుర్తింపు కోసం ప్రామాణికంగా ఉన్న ఆధార్ కార్డు ఇప్పటికే పలుమార్లు ఉచిత అప్ డేట్ గడువు పొడిగించిన కేంద్రం తాజాగా మరో ఆర్నెల్ల పాటు గడువు పెంపు

ఆంధ్ర ప్రగతి అమరావతి, డిసెంబరు 15 :
దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు పరంగా ఎలాంటి గుర్తింపుకైనా ఆధార్ కార్డు ప్రామాణికంగా ఉన్న సంగతి తెలిసిందే. కాగా, ఆధార్ కార్డుల్లో సవరణలు, అప్ డేట్ చేసుకోవడం కోసం కేంద్రం ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగిస్తూ వచ్చింది. తాజాగా మరోసారి గడువు పెంచింది. వచ్చే ఏడాది జూన్ 25 వరకు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేకుండానే ఆధార్ అప్ డేట్ చేసుకోవచ్చని కేంద్రం తన ప్రకటనలో వెల్లడించింది. గతంలో పొడిగించిన గడువు నేటితో ముగియడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

# మనిషికి మరపు సహజం.....!: పవన్ కల్యాణ్

### విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కార్యక్రమం

### హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఆంధ్ర ప్రగతి అమరావతి, డిసెంబరు 15 :
అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసిన పవన్ కల్యాణ్ ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు ఒక జాతికి, ఒక కులానికి నాయకుడు కాదని... ఆయన ఆంధ్ర జాతికి




నాయకుడు అని కీర్తించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పించాలంటే ఆర్య వైశ్య సమాజానికి వెళ్లే అవసరం లేకుండానే ఆయనను గౌరవించుకునేలా ఉండాలని పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సభలో ఆయనకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని తెలిపారు. "మనిషికి మరపు సహజం. మనకు అన్నం పెట్టినవారిని, మనకు తోడుగా నిలిచిన వారిని, మనకు అండగా నిలబడిన వారిని మర్చిపోతారు... కానీ అలాంటి వారిని గుర్తుపెట్టుకోవడం చాలా అవసరం. మనం ఎక్కడ్నుంచి వచ్చాం అనేది మర్చిపోకూడదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం విలువ ఏంటో అర్థమైంది.
పొట్టి శ్రీరాములు 56 రోజుల పాటు కఠోర ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ఆంధ్ర రాష్ట్రం సాకారమయ్యేలా చేశారు. కానీ పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం తర్వాత ఆయన భౌతికకాయాన్ని మోయడానికి నలుగురు కూడా లేని పరిస్థితి బాధాకరం. ఘంటసాల వంటి మహానుభావులు కొంతమంది ఆ రోజు ముందుకొచ్చారు. ఆయన త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం. పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ప్రతి తరానికి గుర్తుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మాకు క్యాబినెట్ సమావేశంలో చెప్పారు. ఆ మహనీయుడి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అంటూ పవన్ పేర్కొన్నారు

# అమరజీవి త్యాగం మరువలేనిది

(మొదటి పేజీ తరువాయి)
ఆయన త్యాగంతో మనమంతా తెలుగు వాళ్లం అంటున్నామని అన్నారు. తెలుగు జాతి కోసం ఆలోచన చేసి ప్రాణత్యాగంతో రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. 58 రోజులు ఆమరణ దీక్ష చేసి ఆంధ్రప్రదేశ్ సాధించారని ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు. ఆ దీక్ష.. త్యాగం మరువలేనివి నేటి ఆమరణ దీక్షలు ఎలా ఉన్నాయో అందరూ చూస్తున్నారని, కానీ ఒక వ్యక్తి త్యాగంతో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఆవిర్భవించాయని సీఎం చంద్రబాబు అన్నారు.
తాను చనిపోయినా పరవాలేదు అని మన తెలుగు ప్రజల కోసం ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. ఒక్కోసారి మంచి చేసినా ఎన్నో ఇబ్బందులు పడాలన్నారు. ఆయన కాడి మోయడానికి నలుగురు రాకపోవడం చాలా బాధాకరమని అన్నారు. కనీసం మద్దతు పలికేందుకు కూడా నాయకులు రాలేదని చెప్పారు. అయినా పొట్టి శ్రీరాములు తాను అనుకున్నది సాధించారని తెలిపారు.
ఈ రోజు సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి.. దేశం ఐక్యత కోసం పోరాటం చేశారని తెలిపారు. అలుపెరగని పోరాటంతో ఉక్కు మనిషిగా చరిత్రలో నిలిచి పోయారని సీఎం చంద్రబాబు అన్నారు.స్వార్థంతో రాష్ట్రాన్ని నాశనం చేశారు..
"కొంతమంది నాయకులు దూరదృష్టితో ప్రజలకు ఎంతో మంచి చేశారు. మరి కొంతమంది తమ స్వార్థం కోసం రాష్ట్రాన్ని, దేశాన్ని నాశనం చేశారు. ఐదేళ్లల్లో పొట్టి శ్రీరాములు స్వగ్రామంలో అభివృద్ధి లేకుండా చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ



అభివృద్ధి కావాలని పని చేశాం. 2019 తర్వాత మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేశారు. ఒక్క అభివృద్ధి, ఒక్క ప్రాజెక్టు నిర్మాణం లేకుండా చేశారు. ఆరు నెలల పాలనలో వారి తప్పులను సరి చేయడమే సరిపోయింది. సంపద ప్రతిఒక్క కుటుంబానికి అందాలి, జీవన ప్రమాణాలు మారాలి. అందరూ ఆర్థిక అభివృద్ధితో, సంతోషంగా ఉండాలనేదే విజన్ 2047. ఎవరో కుట్రలు చేస్తే మీరు అందులో భాగస్వామ్యం కావద్దు. మీ నెత్తిన చెయ్యి పెట్టి అధికారంలోకి వచ్చాక మీ ఆస్తులే లాక్కున్న పరిస్థితి.పొట్టి శ్రీరాములు త్యాగాలతో పాటు, గత పాలకుల పాపాలు కుడా గుర్తు ఉంచుకోండి. అని రాష్ట్ర పరిస్థితిని వివరించారు.మన పరపతి బాగుంది.. నిధులు వస్తున్నాయి లక్షా పాతిక వేలకోట్లు విద్యుత్ భారాలు ప్రజలపై మోపారని సీఎం అన్నారు. ఇప్పుడు కేంద్రంలో మన పరపతి పెరిగింది కాబట్టి నిధులు వస్తున్నాయి.సుస్థిర పాలనతోనే అభివృద్ధి సాధ్యం అని పవన్ కల్యాణ్ తరచూ చెబుతుంటారు. రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వడం దేశంలో ఎక్కడా లేదు. ఇబ్బందులు తాత్కాలికంగా ఉంటాయి%ూ% వాటిని అధిగమిస్తాం. మంచితో పాటు మనకు చెడు చేసిన వారినీ గుర్తుపెట్టుకోవాలి. మీరు గుర్తు పెట్టుకోకుంటే రాష్ట్రం మూడు ముక్కలే. 2025 మార్చి 16 నుంచి పొట్టి శ్రీరాములు 125 వ జయంతి ఉత్సవాలు ఘనంగా చేస్తాం.పొట్టి శ్రీరాములు పుట్టిన గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం, ఇంటిని మెమోరియల్‌గా చేస్తాం. రాజధాని అమరావతిలో స్మృతి వనం ఏర్పాటు చేస్తాం. 2047 నాటికి మన తెలుగు వారంతా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి. ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.20-30 లక్షలు ఉండాలి" అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.
ఇవాళ (డిసెంబరు 15) అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి. ఈ నేపథ్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమం ఏర్పాటు చేయగా... సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ... త్వరలోనే ఏపీలో పొట్టి శ్రీరాములు పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో తాము నెల్లూరు జిల్లా పేరును పొట్టి శ్రీరాములు జిల్లాగా మార్చామని తెలిపారు. పొట్టి శ్రీరాములు స్వగ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. నాడు పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానంతో భాషా ప్రయుక్త రాష్ట్రాల అవతరణకు బీజం పడిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఆ మహనీయుడి ప్రాణ త్యాగంతోనే తెలుగు రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు. సంకల్ప సిద్ధి కోసం ప్రాణాలను సైతం త్యజించిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని చంద్రబాబు కొనియాడారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని రాష్ట్రం మొత్తం నింపాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారని వివరించారు.

# కడప గడపకు పసుపు పూత...

# వైసీపీకి డేంజర్ బెల్స్ ?

ఆంధ్ర ప్రగతి అమరావతి, డిసెంబరు 15 :
కడప అంటే వైఎస్సార్ ఫ్యామిలీకి కంచుకోట. వైఎస్సార్ ప్రతిపక్షంలో అత్యధిక కాలం నెట్టుకుని వచ్చారూ అంటే దానికి కారణం సొంత జిల్లాలో బలం బలగం పెద్ద ఎత్తున ఉండడమే. ఇక ఆయన రాజకీయ వారసుడిగా జగన్ కి కూడా ఆ బలం తోడు అయింది. కాంగ్రెస్ ని జగన్ ధిక్కరించి వచ్చినా సొంత పార్టీ పెట్టినా అక్కున చేర్చుకుని ఆదరించింది సొంత జిల్లా. అయితే 2024 నాటికి మొత్తం పరిస్థితులు మారిపోయాయి. కడపలో టీడీపీ గెలిచి తొడకొట్టి సవాల్ చేస్తోంది. ఇక కడప జిల్లాలో మొత్తం పది అసెంబ్లీ సీట్లకు గానూ వైసీపీకి కేవలం నాలుగు మాత్రమే దక్కితే మెజారిటీ కొటమి ఎగరేసుకుని పోయింది. ఇక కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో కడప జిల్లా పరిషత్ మీద కన్నేసింది. ఎన్నికల ముందు తరువాత కొంతమంది జెడ్పీటీసీలను చేర్చుకుంది. దాంతో అలెర్ట్ అయిన వైసీపీ అధినాయకత్వం వారిని పిలిచి మరీ బుజ్జగించింది. అధికార పార్టీ కంటే కూడా అన్ని రకాలుగా ఎక్కువ ప్రయోజనం కలిగిస్తామని హామీ ఇచ్చింది. అయితే జెడ్పీ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ అయితే ఇంకా రాలేదు. ఈలోగా కడప కార్పోరేషన్ లో వైసీపీ జెండాను దించేసే కార్యక్రమానికి టీడీపీ గట్టిగానే ప్రయత్నాలు మొదలెట్టింది. కడప ఎమ్మెల్యేగా ఉన్న మాధవీరెడ్డి ఆ పనిలో ఫుల్ బిజీగా ఉన్నారు. ఆమె ఇటీవల కార్పోరేషన్ మీటింగ్ కి వెళ్తే ఆమెను వేదిక మీదకు ఆహ్వానించలేదని అనుచరులు రచ్చ చేశారు. అయితే ప్రోటోకాల్ ప్రకారం ఆమెను ఆ విధంగా వేదిక మీదకు అనుమతించే అవకాశం లేదని అధికారులు చెప్పినా ఆ రచ్చ కొనసాగింది. అది హైలెట్ అయింది. అంతే కాదు వైసీపీకి చెందిన మేయర్ సురేష్ బాబు ఇంటి ముందు చెత్తను



పోయించి ఆ మధ్య టీడీపీ నేతలు చేసిన నిరసనలు కూడా ఒక హైలెట్ గా నిలిచాయి. ఇపుడు చూస్తే ప్రభుత్వ విప్ పదవి ఆమెకు ఇచ్చారు. దాంతో పాటు కేబినెట్ ర్యాంక్ హెూదా కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో కడప కార్పొరేషన్ ని వైసీపీ నుంచి లాగేయాలన్న అధినాయకత్వం ఆలోచనలను తెలుసుకుని మరీ ఆమె వ్యూహాలు రూపొందిస్తున్నారు అని అంటున్నారు. కడపలో ఆపరేషన్ ఆకర్ష్ ని స్టార్ట్ చేశారు అని అంటున్నారు. ఈ దెబ్బకు వైసీపీ నుంచి ఏకంగా పదిహేను నుంచి ఇరవై మంది కార్పోరేటర్లు టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. చాలా తొందరలో వారందరినీ అమరావతికి తెచ్చి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేర్చాలని మాధవీరెడ్డి సూపర్ ప్లాన్ రెడీ చేసుకున్నారు. వారికి భారీగా తాయిలాలు కూడా అందిస్తున్నారని టాక్. అదే విధంగా వచ్చే ఎన్నికల్లో మళ్లీ వారికే టికెట్లు ఇవ్వాలని కూడా హామీలో ఉందిట. ఇలా వైసీపీ కార్పోరేటర్లను తమవైపునకు తిప్పుకుని మేయర్ గా ఉన్న సురేష్ బాగుని దించేయాలని మాధవీరెడ్డి పట్టుదలగా ఉన్నారని అంటున్నారు. ప్రోటోకాల్ విషయంలో తమను అవమానపరచిన మేయర్ ని మాజీని చేయడమే సరైన జవాబు అన్నట్లుగా ఆమె దూకుడు చేస్తున్నారు అని అంటున్నారు. టీడీపీ ఆపరేషన్ ఆకర్ష్ కి ఊహించని విధంగా మద్దతు లభిస్తోందిట. మరింతమంది కార్పోరేటర్లు కూడా టీడీపీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారని అంటున్నారు. అదే కనుక జరిగితే జగన్ సొంత ఇలాకాలో కార్పోరేషన్ చేజారడం ఖాయమని అంటున్నారు. ముందు కార్పోరేషన్ తో మొదలెట్టి ఆ తరువాత జెడ్పీ పీఠం కూడా టీడీపీకి దక్కేలా చూసుకుంటే వైసీపీ అధినేత సొంత జిల్లాలోనే ఆ పార్టీ కూశాలు కదిలిపోయాయని ఏపీవ్యాప్తంగా ప్రచారం చేయవచ్చు అని తద్వరా ఆ పార్టీని పొలిటికల్ గా డీ మోరలైజ్ చేయవచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేము.!

**-జిల్లా పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు.**






ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15:

నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో టౌన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ డిసెంబర్ 15వ తేదీని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు ఆత్మార్పణ దినోత్సవంగా ప్రకటించడం జరిగింది.

పొట్టి శ్రీరాములు గారు ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం చేసిన ప్రాణ త్యాగం మరువలేనిది. ఆంధ్ర రాష్ట్రం అవతరించక ముందు మనం మద్రాసీయులంగా పిలవబడే వాళ్ళం అక్కడి నుండే పరిపాలన జరిగేది. మన తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు 1952 సంవత్సరంలో అక్టోబర్ నెలలో బురుజు సాంబమూర్తి గారి ఇంటి వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేయడం జరిగింది. సుమారు 56 రోజులపాటు నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేయడం జరిగింది.

ఆయన చేసిన ప్రాణ త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి మనమందరం ఆంధ్రులముగా పిలవబడుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తో పాటు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మంజునాథ్ నాగభూషణం శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్లో ప్రజా వినతుల స్వీకరణ

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, ఐ.ఎ.ఎస్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 15:
ఈ నెల 16వ తేదీ సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పిజిఆర్ఎస్)" ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం" కార్యక్రమానికి ఈ నెల 16వ తేదీ ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం



ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ డిసెంబర్ 15:
అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినంగా జరుపుకుంటూ సందర్భాన్ని పురస్కరించుకొని ఆవోప ఆళ్లగడ్డ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆవోప రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు ఆళ్లగడ్డ%శీ% ఆవోప కన్వీనర్ ప్రభాకర్ మరియు ఆళ్లగడ్డ ఆవోప కార్యదర్శి గోవిందరాజులు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా ఆవోప ఆళ్లగడ్డ వ్యవస్థాపకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం మరియు అపుస్మ ఆళ్లగడ్డ డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష మరియు కే శ్రీనివాసులు రాంప్రసాద్ ప్రవీణ్ కుమార్ బి కృష్ణమూర్తి వంకదారి రాజా భరత్ వినయ్ కుమార్ కలిసి ఆళ్లగడ్డ టౌన్ లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల అర్పించి అమరజీవి పొట్టి శ్రీరాములు అమర్ రహే అంటూ నినాదాలతో మౌనం పాటించి ఘనమైన నివాళి అర్పించారు ఈ సందర్భంగా ఆళ్లగడ్డ టౌన్ లోని పట్టణ నిరాశ్రయుల వసతిగృహం మెప్మా వారి సత్యం రూలర్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఉన్న వారికి అల్పాహారం ఏర్పాటు చేసి తమ సంస్థ ద్వారా నిరాశ్రయులకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి అయినా మహా పురుషుడు తెలుగుజాతికి చిరస్మనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి డిసెంబర్ 15 ఆత్మార్పణ దినంగా ప్రతి సంవత్సరం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలపడం జరిగింది అమరజీవి పొట్టి శ్రీరాములు స్వాతంత్ర సమరయదుడుగా సంఘసంస్కర్తగా భాష ప్రయుక్త రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడు గాంధీజీ ప్రియ శిష్యుడుగా గాంధీజీ సిద్ధాంతాలైన సత్యం అహింస హరిజనద్ధరణ ఆశయాలను ఆచరణలో పెట్టిన మహెూన్నత వ్యక్తి వారు తెలుగువారి కోసం తెలుగు జాతి కోసం చేసిన త్యాగం భావితరాలకు మార్గదర్శకం ఆదర్శం.

# ఆంధ్ర రాష్ట్ర కోసం ఆత్మార్పణ చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు.!

**-అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.**
**-రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**







ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 15:
ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఆదివారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని నంద్యాల పట్టణంలోని సంజీవ్ నగర్ గేట్ దగ్గర ఉన్న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డీ ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గతంలో దేశ నాయకుల జయంతులు జరుపుకునే వారమని ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని కూడా నిర్వహించి ఘన నివాళులు అర్పించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. దేశవ్యాప్తంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం కృషిచేసిన వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మంత్రి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములును స్ఫూర్తి గా తీసుకొని స్వర్గీయ ఎన్. టి. రామారావు ప్రతి ఒక్క కార్యక్రమానికి ముందు తెలుగు, తెలుగు పదం చేర్చారన్నారు. మద్రాసు రాష్ట్రంలో విలీనమై వుండే తెలుగు ప్రజల కొరకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన శ్రీ పొట్టి శ్రీరాములు సేవలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. ఆయన ఆత్మార్పణ ఫలితంగా కర్నూలు రాజధానిగా 1953 నవంబర్ 1 న ఆంధ్ర రాష్ట్రం ఏర్పరచారని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని ఈ మేరకు నంద్యాల పట్టణంలో శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించుకున్నామన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ ప్రభావంతో సత్యం, అహింస అనే ఆశయాల ప్రభావంతో స్వాతంత్రోద్యమంలో శ్రీ పొట్టి శ్రీరాములు అనేక సంఘటనల్లో చురుకుగా పాల్గొన్నారన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైన శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతి వల్లే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 52 రెండు రోజులు కఠోర నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 15న శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేశారన్నారు. ఆయన త్యాగనిరతి ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శమై ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పాటయ్యే అవకాశానికి నాంది పలికాయన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయాలను ఆదర్శంగా తీసుకుని వారి వర్ధంతికి ఘనమైన నివాళు లర్పించడం మనందరి బాధ్యతని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, ఇరిగేషన్ ఎస్ఇ సుబ్బరాయుడు, డిఇఓ జనార్దన్ రెడ్డి, ఉప ఖజానా అధికారి లక్ష్మీదేవి, పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్, టూరిజం అధికారి సత్యనారాయణ, జిల్లా క్రీడల అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి స్థానాల సభ్యులను అభినందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15:
నంద్యాల నియోజకవర్గంలో జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు టీడీపీకి ఏకగ్రీవం అయ్యాయి. ఏకగ్రీవమైన అధ్యక్షులతో పాటు ఉపాధ్యక్షులను డైరెక్టర్లను , టీసీలు ను టిడిపి కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అభినందించి వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సాగునీటి సంఘం సభ్యులుగా నంద్యాల పట్టణంలోని ఒకటో వార్డు కు చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఆరంగుల బాల మద్దిలేటి అలియాస్ లెజెండ్ బాలు ఎన్నికయ్యారు. అలాగే గెలుపొందిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టిసీలు మంత్రి ఎన్ఎండి ఫరూక్ , ఎన్ఎండి ఫిరోజ్ , ఎన్ఎండి ఫయాజ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సెమి క్రిస్మస్ సెలెబ్రేషన్స్ లో పాల్గొన్న ఎన్ఎండి. ఫిరోజ్





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15:
నంద్యాల పట్టణ శివారులోని నందమూరి నగర్ నందు గల యేసుప్రభు నామ ధ్యాన మందిరం నందు పాస్టర్ సురేష్ కుమార్ నిర్వహించిన 8వ వార్షికోత్సవం మరియు సెమి క్రిస్మస్ వేడుకలలో ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి కూడి వచ్చిన అందరికీ ముందస్తు క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డు ఇన్చార్జి తాటికొండ బుగ్గ రాముడు,నందము బాబురావు, దేరెడ్డి శివనాగిరెడ్డి,భాస్కర్, సిపిఎం పార్టీ నరసింహులు, స్టార్ సొసైటీ సుబ్బరాయుడు మరియు చర్చి పాస్టర్లు చర్చి పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 41 సంవత్సరాలు భవాని దీక్షను చేపట్టిన ఎంసీ మధుబాబు





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15:
నంద్యాల పట్టణ శివారులో ఉన్న శ్రీ జంబులా పరమేశ్వరి దేవస్థానం నందు భవాని మాలాధారులు మరియు సురేష్ ఆధ్వర్యంలో ఎంసీ.మధుబాబు గురుభవాని 41 సంవత్సరాలు నిర్విరామంగా మాలాధారణ చేసిన సందర్భంగా ఘనంగా సన్మానించి, భవాని పూజను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది. 1980 సంవత్సరం ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం విజయవాడ నందు శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి ఆశీస్సులతో శ్రీ రాచకొండ కామేశ్వరమ్మ భవానీ దీక్ష ప్రారంభించడం జరిగిందని అప్పటినుండి ఆ తల్లి కనకదుర్గమ్మ ఆశీస్సులతో భవాని దీక్ష దిగ్విజయంగా ప్రారంభమై మండల దీక్ష 41 రోజులు నియమ నిష్టలతో దీక్ష పూర్తి గావించి విజయవాడ అందలి ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేసి చండీయాగం, పూర్ణాహుతి యందు పాల్గొని మాలా విరమణ చేయుదురని గురు భవాని ఎం సి మధు బాబు తెలియపరచడమైనది అలాగే నేటి అత్యంత ప్రీతికరమైన పౌర్ణమిని పురస్కరించుకొని భవానీ మాలాధారణ వేసిన దీక్షాపరులు తల సేమియా చిన్నారుల మరియు గర్భిణీ మహిళల కోసం మెగా రక్త దాన శిబిరం నంద్యాల బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాల అకాడమీ రవీంద్ర విద్యాసంస్థల అధినేత రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. 41 సంవత్సరాలుగా నిర్విరామంగా దీక్ష గావించిన మధు బాబు గురు భవాని సన్మానించి ఇంత అకుంచిత నిబద్ధతతో తను దీక్ష గావించి ఎన్నో వేల మందితో భవాని మాలా ధారణ గావించిన గురు భవాని చిరస్మరణీయుడని, అలాగే రక్త నిల్వలు పూర్తిగా తగ్గిన నేడు భవాని మాలాధారణ భక్తులు రక్తదానం నందు విరివిగా పాల్గొనడం ఎంతో అభినందనీయమని వారిని అమ్మవారు సర్వదా తన కృపాకటాక్షములతో వృద్ధిలోకి తెచ్చునని రక్తదానం చేసిన ప్రతి భవానిని ప్రశంసించడం అయినది. ఈ కార్యక్రమంలో సురేష్, ఎం సి. మధుబాబు గురు భవాని, బాల అకాడమీ విద్యా సంస్థల అధినేత రవీంద్రనాథ్, రెడ్ క్రాస్ చైర్మన్ డి.దస్తగిరి, ఆర్ అండ్ బి రిటైర్డ్ పి.లక్ష్మయ్య, మాజీకౌన్సిలర్ మున్నయ్య, కన్నమ్మ, లెజెండ్. శ్రీను నంద్యాల బ్లడ్ బ్యాంక్ అచ్చు,భవాని మాలాధారులు తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు.

-పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా నివాళులు.

-జిల్లా విద్యాశాఖాధికారి,జనార్ధన్ రెడ్డి.





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15: ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడు, పొట్టి శ్రీరాములు, ఆంధ్రులకు చిరస్మరణీయుడని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు 72 వ వర్ధంతిని పురస్కరించుకొని నేతాజీ సుభోస్ చెంద్రబోస్ ఆవాసియ విద్యాలము నందు ఏర్పాటు చేసిన కార్యక్రమములో పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డి ఈ ఓ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైన పొట్టి శ్రీరాములు అమరజీవిగా తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాడన్నారు. ఆయన మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడు శ్రీరాములు అని కొనియాడారు. పొట్టి శ్రీరాములు 1930 లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించాడని వివరించారు. తర్వాత మళ్ళీ 1941-42 సంవత్సరాల్లో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడు సార్లు జైలు శిక్ష అనుభవించాడని చెప్పారు. ఆంధ్రుల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణత్యాగానికి పూనుకుని, అమరజీవి అయ్యాడని తెలిపారు. మద్రాసు రాజధానిగా వుండే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు మద్రాసులో 1952 అక్టోబర్ 19 న బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహారదీక్ష ప్రారంభించాడని స్పష్టం చేశారు. డిసెంబర్ 15 న శ్రీరాములు ఆత్మార్పణ చేశారని చెప్పారు. శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం తనను తాను బలిదానం చేసుకున్నాడు తర్వాత కర్నూలు రాజధానిగా 1953 నవంబర్ 1 న ఆంధ్ర రాష్ట్రం ఏర్పరచారన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ నిర్వాకుడు, జి.సుబ్బారాయుడు, వై. రాజేశ్వరమ్మ, హాస్టల్ వార్డెన్ నాగలక్ష్మి, సిబ్బంది సౌజన్య, లక్ష్మీదేవి, రాజు పిల్లలు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎన్.ఎం.డి ఫిరోజ్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ డిసెంబర్ 15: నంద్యాల పట్టణంలోని టిడిపి కార్యాలయం రాజ్ టాకీస్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైతన్నను అనేక కష్టాలకు గురిచేసిన జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు రైతన్న పేరుతో వారు ఉనికిని చాటుకోవడం కోసం ధర్నాలు చేపట్టడం చాలా విడ్డూరంగా ఉందన్నారు . అదేవిధంగా అధికారంలో ఉన్న నాడు ఇండ్ల పట్టాల పేరుతో అసైన్డ్ భూములు చట్టానికి విరుద్ధంగా నిరుపేద రైతుల భూములను బలవంతంగా లాగేసుకొని రైతన్నల కడుపు కొట్టిన జగన్మోహన్ రెడ్డి గారికి వైఎస్ఆర్సిపి నాయకులకు నేడు రైతన్న గుర్తుకురావడం మీ అవకాశవాద కుట్రపూరిత రాజకీయ విధానాలకు నిదర్శనం అని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఎద్దేవ చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలులోకి తీసుకువచ్చి రాష్ట్రంలోని రైతన్న భూముల పైన రైతన్నకు హక్కు లేకుండా ప్రయత్నం చేసిన జగన్మోహన్ రెడ్డి నేడు రైతన్న అంటూ రైతు పక్షపాతిగా వ్యవహరిస్తూ కార్యక్రమాలు నిర్వహించే విధానాన్ని ప్రజలు గమనిస్తున్న సంగతి కూడా తెలుసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు సిగ్గు శరం లేకుండా రైతులకు అన్యాయం జరిగిందంటూ ర్యాలీలు చేయడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఐదేళ్ల అధికారంలో అహంకారపూరితముగా నియంత పాలన కొనసాగించి రైతులను అణగదొక్కి వారికి తీవ్ర అన్యాయం చేశారు. మీవైసీపీ పాలనలో రైతులకు అన్యాయం చేసి రైతుల కోసం ర్యాలీలు చేసి వారిని గురించి మాట్లాడడానికి వైసిపి నాయకులకు సిగ్గుండాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆగ్రహించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెప్పిన వైకాపా నాయకుల ధోరణి మారలేదని ఆయన అన్నారు. వైకాపా ఆధ్వర్యంలో ఎక్కడ ర్యాలీ జరిగిన అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేస్తామని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు సమర్ధవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అంచలవారిగా ప్రజలకు ఏమి చేయాలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలుసుకోకుండా మీరు ర్యాలీలు చేయడం సిగ్గుగా ఉందన్నారు.


# ఘనంగా 65 అంతర్జాతీయ ప్రతిభా వంతుల దినోత్సవం




ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15: నంద్యాల జిల్లా డిసేబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు చంద్రశేఖర్ అధ్యక్షతన నంద్యాలలోని ఏపీ ఎన్జీవోస్ హోమ్ నందు జరిగిన 65వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలలో ప్రముఖ న్యాయవాది బాలహాజీ కి, గౌరవ అధ్యక్షులు మురహరిరావు కి , ట్రెజరర్ అబ్దుల్ జలీల్ కి, డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి కి శాలువా మెమొంటోలతో సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయవాది బాలహాజీ దివ్యాంగుల చట్టాల పైన అవగాహన కల్పించి, దివ్యాంగులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. దివ్యాంగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ..దివ్యాంగులకు 3000 నుంచి 6000 రూపాయలు పెన్షన్ పెంచినందుకు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని దివ్యాంగుల ఉద్యోగస్తులకు ప్రమోషన్లలో ట్రాన్ఫర్ లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని, అర్హులైన దివ్యాంగులు అందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. 20 మంది నిరుపేద దివ్యాంగులకు, దివ్యాంగుల కుటుంబాలకు...

నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగినది. ఆకృతి రెడిమేంట్ షోరూం వారు రుచి కరమైన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జహీరుద్దీన్ , నాయకులు శ్రీనివాసులుసార్,వీరన్న సార్,ఎల్లయ్య, మరియదాసు, స్వప్నిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్వీవై రెడ్డి స్మార్ట్ సిటీని సందర్శించిన ఎన్ఎండి ఫిరోజ్







ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15: నంద్యాల పట్టణ శివారులోని ఎస్సార్ బీసీ కాలనీ పక్కన ఉన్న ఎస్వీవై రెడ్డి స్మార్ట్ సిటీని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ సందర్శించారు అక్కడ ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. గత పాలకులు ఎస్వీవై రెడ్డి స్మార్ట్ సిటీని విస్మరించారని అక్కడ నివసిస్తున్న ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులకు సమస్యలు తెలియజేయగా వాటిని నాకు తెలియజేయడం జరిగిందని అక్కడ ఉన్న రేషన్ సమస్య , వీధిలైట్ల సమస్య , కరెంట్ బిల్లు సమస్య లను తీర్చడం జరిగిందని ఫిరోజ్ తెలియజేశారు. గతంలో ఇక్కడికి రేషన్ రాకుండా ఉంటే అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి ఇక్కడికి రేషన్ ను తీసుకురావడం జరిగిందని అలాగే గతంలో కరెంటు పోల్స్ లేకుండా ఉంటే కరెంటు పోల్స్ వేపిచ్చి వాటికి వీధి దీపాలను వేయడం జరిగిందన్నారు అలాగే కరెంటు బిల్లు కట్టడానికి నంద్యాల టౌన్ కి రాకుండా అక్కడికే వచ్చి కట్టించుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఫిరోజ్ తెలియజేశారు అలాగే కాలనీ వాసులు అడిగిన రోడ్డు సమస్యను మంత్రిగారి దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 38 వ వార్డు టిడిపి ఇంచార్జి దేరెడ్డి శివ నాగిరెడ్డి , కౌన్సిలర్ కండే శ్యాంసుందర్ లాల్, మిద్దె చిన్న హుసేని , బుగ్గ రాముడు, ఇసుక చాంద్ , గోవిందు నాయుడు , దస్తగిరి , మరాఠి సూరి మరియు ఎస్వీవై రెడ్డి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా జూనియర్ కబడి అసోసియేషన్ ఎంపిక పోటీలు.






ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15: నంద్యాల జిల్లాలోని నంద్యాల పట్టణంలో శ్రీ వెంకటేశ్వర విద్యా మందిర్ క్రాంతి నగర్ నందు ఉమ్మడి జూనియర్ కబడి బాలుర మరియు బాలికల ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించడం అయింది. ఈ కార్యక్రమం ఉమ్మడి కర్నూలు మరియు నంద్యాల జిల్లా కబడి అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ శ్రీ ఏపీ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ వెంకటేశ్వర విద్యా మందిర్ కరస్పాండెంట్ శ్రీ వెంకటరాముడు గారు మరియు శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ సుధాకర మరియు ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనిమ్మకాయల సుధాకర్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి క్రీడలను ప్రారంభించారు. సుధాకర్ మాట్లాడుత క్రీడలు శారీరకంగా మానసికంగా ఎంతో ద్రోహద పడతాయని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు అనంతరం ముఖ్య అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది కోచింగ్ క్యాంపుకు 22 మంది బాలురు 25 మంది బాలికలు కోచింగ్ క్యాంపుకు సెలక్ట్ ఎంపిక చేయడం జరిగింది కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం కాశిరెడ్డి నాయన ఆశ్రమం కమ్యూనిటీ సెక్రటరీ శ్రీ శంకర్ రెడ్డి క్రీడభారతి వైస్ ప్రెసిడెంట్ జోష్ణ ట్రెజరర్ మహేశ్వరి మరియు వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్ నాయుడు నాగరాజు శ్రీనివాసులు ప్రతాప్ భాష మహబూబ్బాషా మల్లికార్జున మోహన్ మణికంఠ శివ కోచేస్ కిషోర్ విక్రమ్ పాల్గొన్నారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

# న్యాయశాఖ మంత్రికి ఘనంగా సన్మానం చేసిన టిడిపి లీగల్ సెల్ నాయకులు





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15: కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు గాను, ఆ తీర్మానం అమలయ్యే విధంగా కృషి చేస్తున్న న్యాయ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ ని ఈరోజు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు శ్రీ జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో లీగల్ సెల్ నాయకులు కలిసి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు దాశెట్టి శ్రీనివాసులు , ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి శ్రీనివాస బట్టు, కర్నూల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి కృష్ణమూర్తి, బిజెపి న్యాయ విభాగం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, జనసేన లీగల్ సెల్ నాయకులు సురేష్, కర్నూలు జిల్లా టిడిపి లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్వి ప్రసాద్, జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు హరినాథ్ చౌదరి , నంద్యాల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు ఎస్ఎన్ రాజేశ్వర్ రెడ్డి , నంద్యాల పార్లమెంట్ సభ్యులు అనీఫ్ , గణేష్ సింగ్ ,కార్యదర్శి మహబూబ్ బాషా, మద్దీన్, లీగల్ సెల్ నాయకులుశాంత కుమార్ మంజునాథ్,అయ్య స్వామి, త్రివిక్రమ్, టిప్పు సుల్తాన్ ఎం రఫీ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జగదీష్ కుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా రాయలసీమ వాసుల కలగా మిగిలిన హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని దీనికి రాయలసీమ ప్రాంత న్యాయవాదులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ త్వరగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా న్యాయశాఖ మంత్రిని కోరడమైనది.

# రాష్ట్ర స్థాయి పడవ పోటీల లో పతకాలు సాధించిన నంద్యాల బాలికలకు అభినందన



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 15: నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కెనోయింగ్, కెయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా నంద్యాల పెద్ద చెరువులో జరిగిన రాష్ట్రస్థాయి పడవ పోటీలలో నంద్యాల సునీత ఒకేషనల్ కళాశాల, మదర్ థెరిసా ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన అమ్మాయిలు పతకాలు సాధించారు. డ్రాగన్ బోట్ పడవ పోటీ మిక్సిడ్ విభాగంలో వర్ష,స్పందన,తబిత మొదటి స్థానం సాధించి బంగారు పతకాలు సాధించారు. కెయాకింగ్ వ్యక్తి గత పడవ పోటీ విభాగంలో కూడా ఈ ముగ్గురు కాంస్య పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన వీరిని ఆదివారం కళారాధన కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో రాష్ట్ర ఐ ఎం ఎ మాజీ అధ్యక్షులు,కర్నూలు జిల్లా కెనోయింగ్, కెయాకింగ్ సంఘం వ్యవస్థాపక మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ క్రీడా కారులను అభినందించారు. నంద్యాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడం హర్షణీయమన్నారు. నంద్యాల లో కొన్ని సంవత్సరాల క్రితం ఈ పడవ పోటీల శిక్షణా శిబిరం నిర్వహించామని, ఇప్పుడు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం,అందులో నంద్యాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో నంద్యాల పెద్ద చెరువులో ఈ క్రీడ అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక,యువజన, సాంస్కతిక శాఖ తరపున నూతన క్రీడా విధానం ప్రకటించారని,గుర్తింపు పొందిన అన్ని రకాల క్రీడల అభివృదికి రాష్ట్ర నూతన క్రీడా పాలసి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కిరణ్ కుమార్,ప్రిన్సిపల్ శైలజ,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్, కళారధన కార్య వర్గ సభ్యుడు శివ రామి రెడ్డి పాల్గొన్నారు.